
# స్నేహ సంపద




శేషాద్రి అన్నమాటలకు కుపితులై అతన్నేం చేద్దామా అని ఆలోచించి ఏమీ పాలుపోక కోపాన్నంతా నాలుగు కప్పుల కాఫీతో దిగమింగుతున్నారు మిత్రబృందంలో ఉన్న నలుగురూ.

అసలు ఒచ్చిన కొత్తలో శేషాద్రి ఎవరితో పట్టినా నసనసలాడుతూ మాట్లాట్టం తప్పితే, కాస్తంత కళకళ్ళాడుతూ మాట్లాట్టం ఎవ్వరూ చూళ్ళేదు. బి. కాం. ఆనర్సు పాసయికూడా ఏమీ ఉద్యోగంలేకుండా బజార్లంబడి తిరగటంవల్ల వాణ్ణి అంతా వ్యర్థుడికింద జమకట్టారు. వాడు తప్పితే ఆ మిత్రబృందంలో ఇంటర్మీడియేటుపైన చదివిన వాడెవడూ లేడు. ఐనా అందరూ ఏవో ఉద్యోగాల్లో చొరబడి పాతికరాళ్ళకు తక్కువలేకుండా సంపాదించుకుంటూ 'పురుషులు' అనే పేరు సార్థకం చేసుకుంటూనే ఉన్నారు. నరసాయ, రంగాయ స్కూల్ ఫైనల్ దాకా కూడా రాలేదు. ఐతే ఏం? అప్పుడప్పుడు మిత్రబృందానికి అయ్యారు హోటల్ దగ్గర అవమానం జరక్కుండా ఆదుకోగలిగేది వాళ్ళిద్దరే. 'మాకే గనక యస్. యస్. యల్. సి సర్టిఫికెట్లు ఉన్నట్టయితే మీలాగా గుమాస్తాపనులు చేసేవాళ్ళమటోయ్, ఇప్పటికల్లా ఆఫీసర్లమై యుండేవాళ్ళం' అంటుంటారు.

శేషాద్రి పట్నంవచ్చి నెలదాటింది. రావటం ఏదో ఇంటర్వ్యూ కనివచ్చాడు. ఉద్యోగం ఇచ్చే వాడి పింతల్లి మేనల్లుడికూడా ఆ ఉద్యోగమే కావాల్సిన అవసరం కలగటంవల్ల శేషాద్రికి పట్నం వచ్చినందుకు రైలు ఖర్చు మాత్రమే దండుగైంది. ఒచ్చినందుకు ఉద్యోగం దొరక్కపోతే ఇంటికి తిరిగి పోవాలా! (?); అల్లాపోకుండా, ఏదో ఉద్యోగం దొరకంది ఈ ఊరువిడిచి పోనని భీష్మించుకొని, తెచ్చుకున్న పెద్ద కాగితాన్ని చిల్లరచేసి దాన్ని కర్పూరంలాగా ఖర్చుచేస్తున్నాడు నెలనించీ. ఇటు ఉన్నడబ్బంతా ఖర్చుచేసుకొని, అటు ఉద్యోగమూ దొరక్క, ఇంటికి తిరిగి పోవటానికి రైలు చార్జీలూ ఉండక, చేబదుళ్ళకోసం తమమీదపడక తప్పదని ఊహించుకొని, 'అతనికి ఉద్యోగం దొరకని మరుక్షణంనించీ అతన్ని రైలెక్కించటం ఎల్లాగా?' అని ఆలోచిస్తుండేవాళ్లు రాంబ్రహ్మమూ, రత్తయ్యానూ. ఉద్యోగం దొరకటం హుళక్కి అని తెలిసిన మర్నాటినుంచీ ఆ మనిషికి గౌరవం ఇస్తే, బదుళ్ళకోసం తమ నెత్తినెక్కినప్పుడు, మొహమాటాన్ని హటాత్తుగా రద్దుచేసుకోడం కష్టమని గ్రహించి, మొదటనుంచీ కొంచెంచులకనగా, హేళనగా, మనిషి తమర్నడిగే టంత సందు దొరకనీకుండా, అతన్ని ఆమడదూరంలో ఉంచుతామనే తీర్మానించుకుంది మిత్రబృందమంతా.

'వాంటెడ్ కాలం' చూసీ, ఎవరో చెప్పిన మాటలు వినీ, ఎక్కడెక్కడో ఉద్యోగాలకోసం పగలల్లా తిరిగి, ఎన్నో చీవాట్లుతిని, చీకటిపడేప్పటికల్లా వేళ్లతో జుట్టు మెలితిప్పుకుంటూ రూముకు భోజనం వేళకు తిరిగొచ్చేవాడు. మొదట్లో గుడ్డలు కొంచెం శుభ్రంగా ఉంటంవల్ల ఎవ్వరూ ఎక్కువగా విసిలించకపోయినా, కొన్నాళ్లు కడచింతర్వాత, ఉతుకులకు వెయ్యటానికి సరిపొయ్యే జతలు లేకపోవటంవల్ల, అవ్వే బురదచిందులు పడ్డ లాగులు తొడుక్కొని బయలుదేరటంచేత వీడెవడో మతిలేనిమనిషీలే అనుకుంటుండేవాళ్లు చూసినవాళ్లంతా. కొంచెంగా మతి చలించిన మాటకూడ నిజమే. చివరరోజుల్లో రోడ్డుమీద ఎవరైనా దొరటోపీ పెట్టుకొని పోతుంటే వాళ్ల వెంటబడి, దేబెమొహం వేసుకొని ! ఏమండీ, మీకు తెలిసినచోట ఎక్క

దన్నా ఉద్యోగం ఉంటే చెప్పండీ! అంటం, ఆ పెద్దమనిషెవరో కళ్లు గుండ్రంగా తిప్పి 'ఇదేమిటయ్యా, బజార్లో ఉద్యోగాలు పారేసుంటయా' అనివిస్తుపోవటం, మనవాడు నిస్పృహ జెందకుండా మరోదొరను పోయి అడగటం జరుగుతుండేది.

శేషాద్రి రాంబ్రహ్మానికి కొంచెం దూరపుచుట్టం. రత్తయ్యగూడా మొహమెరిగిన వాళ్లలో ఒకక్క. అందుకని రాంగానే వాళ్ల రూంలోదిగాడు. అతని మొహం చూచి కాకపోయినా, అతని పెద్దవాళ్ల మొహాలు మళ్లీఎప్పుడైనా చూడాల్సి వస్తుందిగదా అని అతనుంటానికి ఏమీ అభ్యంతరం చెప్పలేకపోయారు. వాళ్లిద్దరికి ఇష్టం ఉంటంవల్ల ఆరూంలో ఉండే సూరీ, సత్యాలకు అంత పట్టింపుగా లేదు శేషాద్రి ఉంటం.

ఏదో, రూంలో ఐతే ఉండనిచ్చారు, నాలుగు రోజులు ఉండిపోతాడుగదా అని. కాని డబ్బు సంగతి వేరు. ఎంత చుట్టాలైనా, ఎరిగినవాళ్లయినా డబ్బువిషయంలో నిక్కచ్చిగా ఉంటం మంచిది. ముఖ్యంగా ఐనవాళ్లల్లో బదుళ్లిచ్చిం తర్వాత వాళ్లంతట వాళ్లు తిరిగిస్తే తప్పితే, ఇవ్వమని తిరిగి మన మడగటానికి ప్రాణం పోయినట్లుంటుంది. అందులో ఫలానావాడి దగ్గర డబ్బు లేదు, వాడికి డబ్బు దొరికే అవకాశం లేదు అని ఎరిగున్నప్పుడు వాడికి డబ్బివ్వటం నిజంగా బుద్ధి తక్కువ. ఈ విషయంలో ఉద్యోగాలు చేసే రాంబ్రహ్మం, రత్తయ్యలకు బాగా అనుభవం ఉంటంవల్ల సామాన్యంగా జాగ్రత్తగానే ఉండేవాళ్లు చేబదు లివ్వటంలో. అప్పివ్వకుండా ఉంటానికి ఎవరెత్తులు వాళ్లకే ఉంటయ్. సూరీ, సత్యాలు కొంచెం ఎక్కువ డోసెస్‌లో శేషాద్రిని 'ఫూల్' చేయటానికి పూనుకున్నా రాంబ్రహ్మం, రత్తయ్యా మాత్రం వాడికి కొంచెంగా దగ్గర వాళ్లవటంవల్ల లౌకికంగా ప్రవర్తించటానికి ఉపాయాలు వెతుకుతున్నారు. ఫస్టు తారీఖు వెళ్లి నాలుగు రోజులన్నా కాకపోయినా, చేతిలో డబ్బు లేనట్టు నటించి, శేషాద్రినే అప్పుడప్పుడు ఒకటీ, అరా అడగటంవల్ల వాడికి ముందరి కాళ్లకు బంధాలు వేసినట్టుంటుందని రాంబ్రహ్మం సూచించిన సలహా రత్తయ్యకు బాగా నచ్చింది. అందువల్ల రెండుమూడు తడవలు వెంటనే తెచ్చిస్తామని బదులడిగి తీసుకొని వారం రోజులదాకా ఇవ్వకుండా తరువాత ఎక్కడనో మహా కష్టంమీద పుట్టించుకొచ్చినట్లు నాటకం ఆడి తిరిగీ ఇస్తుండేవాళ్లు.వాళ్ల మంత్రం బాగా పారింది. నెలాఖరుకు డబ్బంతా ఖర్చుపెట్టుకొని, గుడ్డలు ఉతికించుకుండేందుకు డబ్బు లేకుండా, రుద్దుకోటానికి సబ్బు లేకుండా, నెత్తికినూనె లేకుండా ఉన్నప్పటికీవీళ్లనుమాత్రంఏమీఅడక్కుండా పక్క రూములో ఉన్న నరసయ్యనూ, లింగయ్యనూ అడిగి అప్పుడు రెండూ, అప్పుడు మూడూ తెచ్చుకుంటూ ఉండేవాడు. వాళ్లుమాత్రం చదువుకున్న వాళ్లమీదుండే గౌరవంచేతనో, ఇంత చదువుకున్న వాడికూడామనమివ్వగలుగుతున్నాం అనే గర్వం చేతనో అడిగినప్పుడల్లా బదుళ్లు ఇస్తూనే ఉండేవారు. లింగయ్యవి లుంగీలు వేసుకుని తిరుగుతుండేవాడు, గుడ్డలు లాంకీలో వేసుకున్నప్పుడల్లా. శేషాద్రికి డబ్బిచ్చి తిరిగి రాబట్టుకోలేక తమర్ని తిడతారేమోనని భయంగా ఉండేది,రాంబ్రహ్మం వాళ్లకు. మనిషి తమ వాడవటంవల్ల. అందుకనే తమ తప్పు లేకుండా వాళ్లతో కూడా ఓసారి అన్నారు. 'అబ్బాయీ, ఎందుకు అనవసరంగా ఈయన్ను ఈ ఊళ్లో ఉంచడం? చక్కగా వాళ్ల ఊరు ప్రయాణం కట్టించటం మంచిది. అక్కడేమైనా బాగుపడే అవకాశం ఉంటే ఉండొచ్చు!'

'ఇవ్వాళా, రేపూ చూసి ఆదేపని చేద్దామ' న్నారు వాళ్లుకూడాను.

ఐతే, ఇంతలో జరిగిన అసంబద్ధ సంఘటనవల్ల అందరి స్కీములూ నిష్ఫలంచేసిన ఒక ఉత్తరం శేషాద్రి తీసునికొ వచ్చాడు. ఒక పార్సీ ఫరంలో మూడువందల జీతంమీద వెంటనే జాయిన్ కమ్మని ఆర్డరొచ్చిందని.

ఈ వార్త వినగానే అందరికీ ఉడ్డు కుడుచుకున్నట్టుగా ఉంది. సినిమాలో డైరెక్టర్లు ఎంత తన్నుకున్నా 'యాక్టర్లు పెట్టలేని పోజులు పెట్టారు, దర్బీసు ముఖాలు వేళ్లాడేసి.

మర్నాడు పొద్దున్నే రాంబ్రహ్మం అంటున్నాడు. 'శేషూ, ఆ గూడకట్టుతోటె వెళ్తావురా? నా సూటు వేసుకోని వెళ్లరాదూ, మొదటిసారి ఆఫీసుకు వెళ్లటమాయెను.' ప్రస్తుతం సూటు ఎరు

విచ్చినా దండుగ లేదనే ధైర్యం వచ్చింది గామాలు.

మరుసటి నెలంతా ఆ రకంగానే గడిచింది. 'ఏమయ్యా పంతులూ' అంటూ తాటాకులు కట్టిన పెద్దమనుషులు 'ఏమండీ' అని మర్యాదగా ప్రారంభించారు.

నెల తిరిగింది, ఒకటో తారీకొచ్చింది. అందరికీ బాకీలు తీర్చింతర్వాత శేషాద్రి పెట్టా అవీ సర్దుకున్నాడు. ఎవ్వరూ ధైర్యంచేసి ఎక్కడికి? ఏమిటి అని అడగలా. రిక్షా ఓటి మాట్లాడి మరో స్నేహితుడి రూంలోకి మార్చాడు మకాం.

ఒకరోజు మిత్రబృందం అంతా అయ్యరు హోటల్లో కూర్చుంది. శేషాద్రిమాత్రం లేదు.

రత్తయ్యఎత్తాడు,' శేషాద్రిరూం ఎందుకు మార్చినట్టూ?' అని. రాంబ్రహ్మం అందుకున్నాడు, 'ఆ రూంకంటూ మనరూమే నయంగదుట్రా' అని.

లింగయ్య బయటపెట్టాడు. తనతోటి శేషాద్రి ఓసారి అన్నాట్ట. అయినవాళ్ళతో కలిసి ఉంటం అంత మంచిదికాదనీ, వాళ్లు తనను చేబదుళ్లూ అవీ అడుగుతుంటే తనివ్వకుండా ఉంటం కొంచెం కష్టంగా ఉంటుందనీ. శేషాద్రి అన్న ఈ మాటలకు కుపితులై అతన్నేం చేద్దామా అని ఆలోచించి ఏమీ పాలుపోక కోపాన్నంతా నాలుగు కప్పుల కాఫీతో గుటగుట దిగమింగుతున్నారు మిత్రబృందంలో ఉన్న నలుగురూ.

# ఇనాం రైతుల గోడు

బి వి. రావు

ఎలాగైతేం జమిందారుల బిల్లు అసెంబ్లీకి వచ్చింది. బిల్లుకు చిల్లులు పొడవటాని పోటీ పడ్డారు. హైకమాండువారి సలహాలతో సెలెక్టు కమిటీవారి సూచనలతో బిల్లు చిత్రమైన ఆకారం పొందింది. 1936 నాటి యినాములను బిల్లునుండి వేరుచేశారు. జమీందార్లు యినాందార్లు నెగ్గారు.

ఇంతకాండ జరుగుతూంటే మహానాయకులేమి చేస్తున్నారు ?

హైకమాండువారు జమీందార్లకు, యినాందార్లకు ఏమాత్రం నష్టంరాకుండా కాపాడడానికి కంకణం కట్టుకు కూర్చున్నారు. ఆంధ్ర కేసరి హైకమాండువారు కలుగజేసుకోడాన్ని ఎదిరిస్తారు; కాని వారి దృష్టిలోకి రైతులురారు. 'ప్రకాశం కమిటీ' రిపోర్టే వారికి యినాం రైతుపైన వున్న అభిమానానికి నిదర్శనం. ఇక రైతుబాంధవుడు రంగాగారా ? ఆయన ప్రపంచనాయకుడు. ఇనాం రైతుల గోడు వినడానికి తీరికుంటుందా ? పోతే కళావారో ? మంత్రిపదవి కాపాడుకోవడమే ఆయనకు కావలసింది. కిసాన్ కాంగ్రెస్ గొర్రిపాటి వారున్నారంటే ఒక ప్రకటనతో ఆయన కర్తవ్యం నెరవేరినట్లు భావిస్తారు. అయితే రైతులెన్నుకుని పంపిన అసెంబ్లీ సభ్యులేమయారు ? ఎసెంబ్లీలో బిల్లుపై చర్చజరుగుతూంటే జమీందార్లకు అనుకూల సవరణల గోలేగాని రైతుల తరఫున అలజడేలేదు.

ఇదీ స్వతంత్రభారత్ లో ప్రజానాయకులపాత్ర.

ఐక్యఆందోళనతో ప్రదర్శనాలతో బిల్లుకు పురిటిలోనే సంధి కొట్టకుండా కాపాడుకొన్నాం. బిల్లునుండి యినాములను వేరుచేయనీయలేదు. ఈనాడేమైంది ఆ ఆందోళన ?

రైతు సంఘాలను నిషేధించినంత పని చేశారు. రైతునాయకులపైన వారంట్లు జారీచేశారు. అరెస్టు చేస్తున్నారు. ఇంకేముంది, స్వేచ్ఛ ! రైతులను సమీకరించే వారెవరు ?

బ్రిటిష్ ప్రభుత్వ హయాములో క్రిందినుంచి పైవరకు యినాందారుల ఆహ్వానించేవారే వుండేవారు. స్వతంత్రభారత్ లోకూడా ఆస్థితేనా ? అయితే రైతులగోడు వినేదెవరు ?